క్లుప్తంగా

స్వామివారి సేవలో నాగిరెడ్డి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

475 మందికి వైద్య పరీక్షలు



ఎదురుమొండి(నాగాయలంక): అసిస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ జీఎం జాస్తి రంగారావు, డాక్టర్ పృథ్వీతేజ్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రీసెర్చ్ వైద్య విభాగానికి చెందిన 25 మంది డాక్టర్ల బృందం గుండె, మెదడు, న్యూరో, మూత్రపిండాలు తదితర 23 రకాల వ్యాధులకు సంబంధించి 475 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ పద్మసుందరి, డాక్టర్ వైష్ణవి, అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ ఎంఎస్ఆర్ మూర్తి, ఎంవీ రామారావు స్థానిక ఇన్‌చార్జి డి.వెంకటరావు, జి.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

బంటుమిల్లి: బంటుమిల్లి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకున్న, పెట్రోలు వాహనాలు మంటలకు గురైన వాటిని ఏలా నివారించాలో సిబ్బంది డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసరు జి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

చల్లపల్లి: రాష్ట్ర సచివాలయం న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి వెలగపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ గృహం వృద్ధాశ్రమానికి సహాయం అందజేశారు. వృద్ధులకు అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందచేశారు. దాసి సీతారామరాజు, మాతంగి అనూప్, కిషోర్, ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు పాల్గొన్నారు.

అత్తింటివారి వేధింపులపై మహిళ ఫిర్యాదు

పెడన: వరకట్నం కోసం భర్త, అత్తమామ, మరిది వేధిస్తున్నారని ఓ వివాహిత పెడన పోలీసులను ఆశ్రయించింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడక గ్రామానికి చెందిన దావు నందినికి దావు మణికంఠతో మూడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల తనను భర్త దావు మణికంఠ, అత్త,మామ సుబ్బారావు, తులసమ్మలతో పాటు దావు ప్రసాద్ వరకట్నం కోసం వేధిస్తున్నారని, న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

యజమానిపై కార్మికురాలి బంధువుల దాడి..

పెడన:తన వద్ద పనిచేసే మహిళకు నగదు చెల్లించి ఫోన్లో మాట్లాడినందుకు సదరు మహిళా బంధువులు తనపై దాడి చేశారని బ్రహ్మపురానికి చెందిన పి. నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగరాజు కలంకారీ షెడ్డు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద పనిచేసే పావని అనే మహిళకు ఫోన్ పే ద్వారా కూలీ సొమ్ము చెల్లిస్తున్నారు. ఫోన్‌పే ద్వారా చెల్లింపు కాకపోవడంతో నగదు ఇచ్చే విషయమై ఫోన్లో మాట్లాడారు. ఈ విషయాన్ని అడ్డం పెట్టుకుని తనను పావని బంధువులు గోపయ్య, అర్జునరావు, శ్యామలరావుతో పాటు మరో ఐదుగురు తీవ్రంగా కొట్టారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

వృద్ధురాలిపై దాడి..

పెడన:మడక గ్రామానికి చెందిన అనసూయ (60) తనను పక్కింటి వ్యక్తి కొట్టాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనసూయ ఇంటి పక్కనే ఉంటున్న గంజాల సురేష్‌కు ఆమె గడ్డపలుగు ఇచ్చింది. ఆ పలుగు తిరిగి ఇవ్వలేదు. గడ్డపలుగు అడిగితే డబ్బులు ఇస్తానని చెప్పాడు. డబ్బులు కూడా ఇవ్వలేదు. ఈ విషయాన్ని తెలిసిన వారందరికి అనసూయ చెబుతోంది. ఆగ్రహించిన సురేష్ ఆమెపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ చేసిన మేలు మరువలేము

'జగనన్నే మా భవిష్యత్తు'లో పేర్ని కిట్టుతో మహిళలు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబాలకు చేసిన మేలులు మరువలేమని పలువురు మహిళలు అన్నారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం 39, 3, 9 డివిజన్లలో ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను, క్యాలెండర్‌ను స్థానికులకు అందజేశారు. సీఎం జగన్ చిత్రాలతో కూడిన స్టిక్కర్లను వారి అనుమతితో గోడలపై, సెల్ ఫోన్లపై అంటించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పాలన ఎలా ఉందని మహిళలను పేర్ని కిట్టు అడిగి తెలుసుకున్నారు. మహిళలు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, అందువల్లే తమ కుటుంబాలకు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. అమ్మఒడి పథకం వల్ల తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించుకోగలుతున్నామని కొంత మంది మహిళలు చెప్పగా, మరి కొందరు మహిళలు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో తమ పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారని వివరించారు. మహిళాభ్యున్నతికి సీఎం జగన్ అందిస్తున్న చేయూత మరువలేనిదని వివరించారు. కార్యక్రమాల్లో 39, 9 డివిజన్ల కార్పొరేటర్లు గోపిశెట్టి సతీష్, రామిశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ శీలం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నగరంలోని పలు డివిజన్లలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి నిర్వహించారు.



కరెంటు కాలనీలో స్టిక్కర్‌ను అంటిస్తున్న పేర్ని కిట్టు

జగనన్న ఉంటేనే మాకు పథకాలు వచ్చేది..

పెడన: ముఖ్యమంత్రిగా జగనన్న ఉంటేనే మాకు సంక్షేమ పథకాలు అందుతాయని పలువురు లబ్ధిదారులు అన్నారు. ఆదివారం పట్టణంతో పాటు మండలంలో పలువురు క్షేత్ర స్థాయి ప్రజాప్రతినిధులు వారి వారి పరిధిలోని గృహ సారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్టిక్కర్లు అంటించారు. చెన్నూరులో మాజీ జెడ్పీటీసీ బుంగా నాని, శివ, పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణి, వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలోని రెండో వార్డులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి డోర్ స్టిక్కర్ అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. జగనన్న పథకాల అమలుపై వారి అభిప్రాయాలను నమోదు చేశారు. నాగేశ్వరరావుపేట, జానకీరామపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, ఎంపీటీసీ ఎం. తిరుపతమ్మ, వై. కొండ, ఎల్. మారుతి, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలో ఆదివారం ఎంపీటీసీ సభ్యురాలు మత్తి లత, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వరరావు, మత్తి రాంప్రసాద్, గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి రాజాచంద్, మండల సోషల్ మీడియా కో–కన్వీనర్ మత్తి దాసు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పెడన 2వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాజీవ్, చైర్‌పర్సన్ రాణి తదితరులు



నాగేశ్వరరావుపేటలో కరపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ



కె. కొత్తపాలెం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

విద్యార్థుల పుస్తకాలను పరిశీలించకపోతే ఎలా?

● డీవైఈఓ సుబ్బారావు ఆగ్రహం
● జీజీకేజెడ్పీహెచ్ఎస్‌లో తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ సుబ్బారావు

పెడన: విద్యార్థుల నోటు పుస్తకాలను కూడా పరిశీలించకుండా ఉంటే ఎలా అంటూ మచిలీపట్నం ఉప విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పెడనలోని భట్ట జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్‌ను ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులతో మాట్లాడారు. వారు రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించడంతో పాటు వాటిని చదవి వినిపించాలని కోరడంతో విద్యార్థులు తడబడ్డారు. కొందరు బాగానే చెప్పారు. మరి కొందరు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల నోటు పుస్తకాలను ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు పరిశీలించకపోవడం, నోటు పుస్తకాల్లో విద్యార్థులు చేసిన తప్పులు దిద్దకపోవడం వంటి విషయాలను గుర్తించారు. దీనిపై డీవైఈఓ సంబంధిత ఉపాధ్యాయులపై మండిపడ్డారు. పరిస్థితి మార్చుకోవాలని సూచించారు. అనంతరం ఉదయం విద్యార్థులకు ఇస్తున్న రాగి జావ, మధ్యాహ్న భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రగతిని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ

● ఉల్లిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం
● ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉల్లిపాలెం సచివాలయ పరిధిలో ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని రామాలయం, మధ్య వాడకట్టు ప్రాంతంలోని 243 ఇళ్లకు తిరిగి, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను అందించారు. గతంలో ఏ ప్రభుత్వాలు అందించలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అమలు చేసి చూపించారని రమేష్‌బాబు అన్నారు. ఇలాంటి నాయకుడు సీఎంగా ఉంటే ప్రతి ఇల్లు సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. ఇచ్చిన



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

హామీల కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు.

అడగకుండానే అన్నీ ఇచ్చారు..

గత ప్రభుత్వంలో ఏ పథకం అమలు కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చేదని, కాని ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడగకుండానే అన్ని పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నారని పలువురు లబ్ధిదారులు రమేష్‌బాబు వద్ద హర్షం వ్యక్తం చేశారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలతో పాటు అనేక పథకాలకు అర్హత ఉంటే ఏవిధమైన సిఫారసులు లేకుండా నేరుగా ఇళ్లకు వస్తున్నాయని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు.

జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచి వెత్రి పావని, శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, సచివాలయ కన్వీనర్లు కమ్మిలి కోటేశ్వరరావు, సనకా రాము, ఆరే పావని, ఉప సర్పంచి ఆరే కిరణ్, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొక్కిలిగడ్డ శ్రీమన్నారాయణ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, మత్స్యకార నేత చిలకలపూడి ధర్మయ్య, ఎంపీటీసీ సనకా శైలజ పాల్గొన్నారు.

దేవస్థానంలో ఎయిర్ కూలర్లు ప్రారంభం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన మూడు ఎయిర్ కూలర్స్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆదివారం ప్రారంభించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ స్వామివారి దర్శనార్థం నిత్యం ఆలయంకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎండోమెంట్ నిధులు సుమారు రూ. ఒక లక్షతో మూడు ఎయిర్ కూలర్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలుత ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు..

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం



ఎయిర్ కూలర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ప్రారంభించారు. వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు రెండు నెలల పాటు నిత్యం మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ఆటపాటలతో కూడిన విద్య అవసరమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు బాటలు వేస్తుండటం అభినందనీయమని చెప్పారు. స్థానిక సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాల కిడ్స్ కాన్వకేషన్, వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక లక్ష్మీటాకీసు సెంటర్‌లో జరిగింది. ముఖ్య అతిథి పేర్ని కిట్టు మాట్లాడుతూ పాఠశాలలు కూడా తల్లిదండ్రుల అభిరుచులకు అనుగుణంగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారు అన్ని విధాలా ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతున్నారన్నారు. పలు విద్యా విషయక అంశాల్లో ప్రతిభ



చిన్నారుల నృత్య ప్రదర్శన

చూపిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్‌ను అందజేశారు. యుకేజీ నుంచి ఒకటో తరగతికి వెళుతున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. పదో డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషా, కేఎల్ గ్రాండ్ వ్యవస్థాపకుడు బొర్రా నటేష్‌బాబు, స్కూల్ డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ విన్నకోట హరిణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని ఉమా సరస్వతికి నేషనల్ ఫెలోషిప్ అవార్డు



ఉమా సరస్వతిని సత్కరిస్తున్న కొమ్మినేని తదితరులు

బంటుమిల్లి: పెదతుమ్మిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఓలేటి ఉమా సరస్వతిని సావిత్రీబాయిపూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డుతో సత్కరించారు. ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సంస్థ అధ్యక్షుడు వీఆర్ సుశీల్‌కుమార్, ఫౌండర్ ఆఫ్ సంరక్షా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌స్వామి, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు అద్దంకిరాజ, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లు రమావతి తదితరులు పాల్గొని ఉమా సరస్వతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషాభ్యున్నతికి ఆమె చేస్తున్న రచనలు, సేవలను కొనియాడారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం, తెలుగు నాటక దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం కళాకారులు ప్రదర్శించిన పలు పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీ రామాంజనేయ యుద్ధం, మయసభ ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులను వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 2వ డివిజన్ కార్పొరేటర్, కళాకారుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు పరింకాయల విజయచంద్రకుమార్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ నాటక ప్రదర్శనలను



నాటక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో కళాకారులు

ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జి మామిడిబత్తుల అజయ్, బాలాజీ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: శ్రీ వాసవి విద్యార్థి సహాయ నిధి ట్రస్ట్ 8వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చేతుల మీదుగా 250 మంది విద్యార్థులకు రూ. 2 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని, నోట్ పుస్తకాలను అందజేశారు. ఆరుగురు మహిళలకు కుట్టుమిషన్లు, ఆరుగురికి సైకిళ్లు, 20 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ శ్రీ వాసవి విద్యార్థి సహాయ నిధి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత ఎనిమిదేళ్లుగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. సహాయనిధి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగుండు రమేష్‌ను అభినందించారు. డిప్యూటీ మేయర్ లంకా



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న వెలంపల్లి తదితరులు

సూరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, 49వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు తుమ్మలపల్లి జగన్నాథం, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్‌కుమార్, శ్రీకాకోళపు నరసింహగుప్తా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పెడన: ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్డులోని పశువుల ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ బళ్ల గంగయ్య, ఆసరా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో..

బంటుమిల్లి: బంటుమిల్లి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ మండపం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. సేవా సమితి ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా రెండు నెలలపాటు దాతల సహకారంతో చలివేంద్రం నిర్వహిస్తారు. అయ్యప్ప గురుస్వామి కొల్ల రాంబాబు పర్యవేక్షణలో కొనసాగుతున్న చలివేంద్రంలో తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు.

ట్యాక్సీ యూనియన్ సేవలు ప్రశంసనీయం..

చల్లపల్లి: గ్రామంలో ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని రవాణా శాఖాధికారి వి.సీతాపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయం–1 ఎదుట లక్ష్మీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ రాణి, గంగయ్య దంపతులు, చిత్రంలో ఎస్ఐ రవి

విఘ్నేశ్వర ట్యాక్సీ ఓనర్లు, డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ చలివేంద్రం, గ్రామ దేవత సంపటాలమ్మ అమ్మవారి ఆలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేయగా సీతాపతిరావు ప్రారంభించారు. సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), దాత అడపా రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు గంజాల రాధాకృష్ణ, తోట వెంకటరమణ, ఎండీగయాజ్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పనులు



కోనేరుసెంటర్: పెదపట్నం గ్రామం జగనన్న కాలనీలో ఆదివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. గ్రామంలోని పేదలకు ఇటీవల ఈ కాలనీలో స్థలాలు మంజూరు చేయగా లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టారు. కాలనీలో తుమ్మ చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో గృహ నిర్మాణదారులు సమస్యను సర్పంచ్ గడిదేసి అనూష దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. గ్రామ సచివాలయం సలహాదారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గడిదేసి రాజు పనులను పర్యవేక్షించారు.

రంజాన్ తోఫా పంపిణీ

చల్లపల్లి: రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింలకు దాతలు సహాయం చేయడం అభినందనీయమని ఎస్ఐ సీహెచ్ చినబాబు అన్నారు. ఆదివారం స్థానిక పడమర వైపు ఇస్లాంనగర్‌లో గ్రామ సచివాలయం వద్ద అక్షయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫాను ఎస్ఐ చేతులమీదుగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ అడపా రవి ఆధ్వర్యంలో పాదం నవీన్ కుమార్ (కాలిఫోర్నియా), అంబవరం చంద్రశేఖరరెడ్డి (కాలిఫోర్నియా), సందు నరసింహారావు (కెనడా) ఆర్థిక సాయంతో రంజాన్ తోఫా అందచేశారు. కార్యక్రమంలో పఠాన్ కరిముల్లా ఖాన్, బొండలపాటి వీరబాబు, పాగోలు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్ వాలీబాల్ ఆటలతో సందడి చేయగా, చిన్నారులు, వృద్ధులు ఇసుకతిన్నెలపై సేదతీరుతూ ఉల్లాసంగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరంలో పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేసి ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

తీరంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో హెచ్చరిక బోర్డులను అటవీ శాఖాధికారులు ఎట్టకేలకు ఏర్పాటు చేశారు. సంగమం వద్ద ఎక్కువ లోతు ఉన్న నేపథ్యంలో ఇటీవల పెనమలూరుకు చెందిన యువకుడు ప్రమాదశాత్తు ఈ ప్రాంతంలో గల్లంతయ్యాడు. తీరంలో పోలీసులు, అటవీ అధికారులు ఏవిధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రాంత పరిస్థితులపై పర్యాటకులకు అవగాహన ఉండడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శలు తలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సంగమం వద్ద లోతును తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

అయ్యప్పకు పూజలు

బంటుమిల్లి: స్థానిక సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా శనివారం రాత్రి విషపూజ ఘనంగా నిర్వహించారు. కొల్ల రాంబాబు గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీనగర్‌కు చెందిన భజన బృందం పాడిన పాటలు అలరించాయి. అయ్యప్ప కాంస్య విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన అయ్యప్ప దీక్షాధారులు, భక్తులు పాల్గొన్నారు.